స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

◆ నిఘా నీడన పరిసర ప్రాంతాలు

◆ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-హిందూపురం, లేపాక్షి

సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలు, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఆయా స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చి మూడెంచెల భద్రతను పటిష్టం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం హిందూపురం పట్టణ సమీపంలోని బిట్ కళాశాల, లేపాక్షి చోళ సముద్రం వద్దనున్న డా॥బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని .స్ట్రాంగ్ రూములను తనిఖీ చేశారు. అక్కడున్న ప్రస్తుత పరిస్థితులు, భద్రత చర్యలు, విధులు నిర్వర్తిస్తున్న వారి పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల తనిఖీలలో భాగంగా ఈవీఎం గదులను పరిశీలించి సంబంధిత అధికారులకు సీసీ కెమెరాల పనితీరు, పోలీసు పహారా నిరంతర విద్యుత్ సరఫరా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తదితర అంశాలపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అలాగే కమాండ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన తర్వాత విజిటర్స్ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం కౌంటింగ్‌ల ప్రక్రియను రెండు కేంద్రాల్లో చేపట్టినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలను ఉంచి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు 24 గంటల పాటు రక్షణగా ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను నిరంతరం పర్య వేక్షించేందుకు సీసీ కెమెరాలు అమర్చామన్నారు. భద్రత వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో డీఎస్పీ స్థాయి అధికారులు ఇతర పోలీస్ ఉద్యోగ సిబ్బంది ఆధ్వర్యంలో 24 గంటలు విధులు కౌంటింగ్ సెంటర్లలో కొనసాగుతాయని తెలియజేశారు. అనంతరం స్ట్రాంగ్ రూములను పరిశీలించిన తర్వాత సంబంధిత ఆర్ఒలకు కలెక్టర్ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలను ఎవరూ అతిక్రమించరాదన్నారు. కౌంటింగ్ సెంటర్ల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా కౌంటింగ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న వారు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియ వరకు బందోబస్తు కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ, ధర్మవరం రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి, మడకశిర రిటర్నింగ్ అధికారి గౌరీ శంకర్, హిందూపురం డీఎస్పీ కంజక్షన్, సిఐ ఈరన్న, పెనుకొండ తహశీల్దార్ ఉదయ శంకర్, చిలమత్తూరు తహశీల్దార్ భాగ్యలత, మడకశిర తహశీల్దార్ వెంకటేష్, ఆర్ఐ అమర్, ఎస్ఐ గోపి, తహశీల్దార్ వెంకటేష్ పాల్గొన్నారు.

అనంత ఎస్పీపై వేటు..!

◆ మరికొందరు కిందిస్థాయి సిబ్బందిపై చర్యలకు ఆదేశం ◆ అల్లర్లు జరిగిన చోట ప్రత్యేక కేంద్ర బలగాలు

ఎస్పీ అమిత్ బర్దర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల అనంతరం తాడిపత్రిలో వరుసగా ఘర్షణలు చోటు చేసుకోవడంపై ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుంది. అనంతపురం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనతోపాటు దిగువ స్థాయి అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో అల్లర్లు జరిగిన ప్రాంతంలోనున్న డివిజన్ల స్థాయి అధికారులపైనా చర్యలుండే అవకాశముంది. అల్లర్లను అణచివేయడంలో విఫలమైన అధికారులెవరన్నది తేల్చేందుకు ప్రత్యేకమైన విచారణను చేపట్టేందుకు ఒక కమిటీని నియమించాలని పేర్కొంది. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయిలో ముగ్గురు అధికారుపై ఇటువంటి ఉత్తర్వులివ్వగా ఇందులో అనంతపురం జిల్లా ఎస్పీ కూడా ఉండటం విశేషం. వాస్తవానికి అమిత్ బర్దర్ ఎన్నికల సంఘం నియామకం మేరకు ఇక్కడికి వచ్చారు. ఎపీఎస్పీ కమాండెంట్‌గానున్న అమిత్ బర్దర్‌ను ఎన్నికల నోటిఫికేసన్ తరువాత నియమించారు. అంతకు మునుపున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్‌పై ఆరోపణలతో ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించారు. ఆ స్థానంలో అమిత్ బర్దర్‌ను ఎన్నికల సంఘం నియమించింది. బాధ్యతలు చేపట్టాక శాంతియుతంగా ఎన్నికల నిర్వహణపై చర్యలు తీసుకున్నారు. ఎన్నికల్లో ఎక్కడా ఆయనపై రాజకీయపరమైన ఆరోపణలేవి రాలేదు. అయితే ఎన్నికల రోజు తాడిపత్రిలో టిడిపి, వైసిపి వర్గీయుల మధ్య చెలరేగిన ఘర్షణను అణచివేయలేక పోయారన్నది ప్రధానమైన అభియోగం. స్వయంగా ఆయనే అక్కడున్నా పరిస్థితి చక్కబడలేదు. ఇరువర్గాలు పరస్పరం రాళ్ళు రువ్వుకున్నారు. ఈ రాళ్ల దాడుల్లో ఆయన కూడా గాయపడ్డారు. వరుసగా ఇవి చోటు చేసుకోవడంతో ఇది దేశ వ్యాప్తంగానూ చర్చనీయాంశమైంది. బుధవారం రాత్రికి పక్క జిల్లాల నుంచి ప్రత్యేక పోలీసు బలగాలొచ్చి మరింత రచ్చ చేశాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అనుయాయుడు కిరణ్‌పై పోలీసులే దాడి చేసి తీవ్రగా గాయపరిచారని ఆరోపిస్తున్నారు. ఇందుకు గతంలో పనిచేసి వెళ్లిన డిఎస్పీ చైతన్య కారణమని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌ను ఎన్నికల సంఘం సస్పెన్షన్ చేయడం చర్చనీయాంశమైంది. ఇక కింది స్థాయి అధికారులెవరేవరన్నది కూడా తేలాల్సి ఉంది. ఇక్కడ డిఎస్పీగా గంగయ్య ఉండగా, సిఐగా మురళీ కృష్ణ ఉన్నారు. ఈ దాడుల్లో మురళీ కృష్ణ తలకు గాయాలయ్యాయి. మరికొంత మందికి గాయాలయ్యాయి. అయితే వీరిలో ఎవరెవరిపై వేటు పడనుందన్నది చూడాల్సి ఉంది. ఎన్నికల సంఘం మాత్రం గట్టిగా హెచ్చరికలు చేస్తూ ఆదేశాలిచ్చింది. బాధ్యతలపై కఠినమైన చర్యలు ఉండాలని, వాటికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేయాలని కూడా పేర్కొంది. దీంతో దిగువ స్థాయి అధికారుల్లోనూ గుబులు మొదలైంది.

గ్రామాల్లో ప్రశాంత జీవనం గడపండి : సిఐ

రాజకీయ నాయకులు, పాత నేరస్తులకు హెచ్చరిక

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎన్నికలు ముగిశాయి.. త్వరలో ఫలితాలు వెలువడుతాయి.. అయితే గ్రామాలన్నీ ప్రశాంతంగా ఉండాలని.. లేనిచో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు రాజకీయ పార్టీల నేతలు, పాత కేసుల్లోని నిందితులను హెచ్చరించారు. సిఐ, ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి గురువారం మండలంలోని దంపెట్ల, డి.చెర్లోపల్లి, ఎం.చెర్లోపల్లి, వెంకటగారిపల్లి, నల్లబోయనపల్లి, పోట్లమర్రి గ్రామాల్లో పర్యటించారు. సిఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగానే నిర్వహించామని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఫలితాలు వెలువడిన తరువాత కూడా సహకరించి ప్రశాంత వాతావరణం కల్పించుకుందామన్నారు. అందరూ కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి పాటుపడదామన్నారు. కక్షలు వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదన్నారు. మానసిక అశాంతి తప్పా ఏమీ ఉండద న్నారు. కుటుంబ సభ్యులతో, గ్రామస్థులతో సంతోషంగా గడపాలన్నారు. లేనిచో పోలీసులు చేపట్టబోయే చర్యలకు బాధితులు అవుతారన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని, మండల ప్రజలు ఈ గమనించాలన్నారు.. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ ఆంక్ష లు అమలులో ఉంటాయన్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులకు సహకరించాలన్నారు.

అంతటా ఉత్కంఠ..!

◆ సార్వత్రిక ఎన్నికల గెలుపోటములపై సర్వత్రా చర్చ

◆ ఓటింగ్ శాతంపై అభ్యర్థుల లెక్కలు

◆ గెలుపుపై ఎవరి అంచనాలు వారివే..



ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సమరం హోరాహోరీగా జరిగింది. ప్రధానంగా టిడిపి, వైసిపిలు నువ్వానేనా అన్నట్లు ప్రచారలు కొనసాగించారు. అదే ఊపుతో సర్వశక్తులూ ఒడ్డి పోలింగ్‌కు కష్టపడ్డారు. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఓటర్ల తీర్పు ఎలా ఉందన్న దానిపై అందరూ దృష్టి సారించారు. ముఖ్యంగా బరిలో నిలిచిన అభ్యర్థులు గ్రామాలు, వార్డుల వారీగా లెక్కలు తీస్తున్నారు. అనుకున్న దాని కంటే పోలింగ్ శాతం పెరగడం అభ్యర్థులకు కునుకు లేకుండా చేస్తోంది. పెరిగిన ఓటింగ్ శాతం దేనికి సంకేతం అన్న భావనలో అభ్యర్థులు ఉన్నారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి రెండు రోజులు అయ్యింది. పోలింగ్ అయితే ముగిసింది కానీ, గెలుపు మాత్రం ఇంకా పెండింగ్‌లో ఉంది. విజేత ఎవరన్నది తేలాలంటే ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆగాల్సిందే. ఈ పరిస్థితుల్లో అభ్యర్థులు, ముఖ్య నాయకులు వారి సొంత సమీకరణలో ముందుకు వెళ్తున్నారు. ఏఏ కేంద్రాల్లో తమకు అనుకూలంగా ఓట్లు పడ్డాయో లెక్కలు వేస్తున్నారు. గెలుపు ఓటములపై ఆయా గ్రామాలు, వార్డుల ముఖ్య నేతలతో చర్చిస్తున్నారు. టిడిపి, వైసిపి మధ్య ప్రధాన పోటీ జరిగిందని తేలడంతో ఫలితంపై ఆ రెండు పార్టీల ముఖ్య నాయకులు అంచనాలు వేస్తున్నారు. ఇక ఆయా పార్టీల మద్దతుదారులు సైతం ఏ పార్టీ గెలుస్తుందన్న దానిపై సర్వత్రా ఉత్కంఠగా ఉన్నారు. ఎవరికి వారు ఆయా కేంద్రాల్లో జరిగిన పోలింగ్ సరళిని బట్టి ఫలితాలను అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఈ దసారి ప్రజలు ఓటువేసేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరిచారు. ఆయా పార్టీలు ప్రచార సమయంలో ఇచ్చిన హామీలు, భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి వారి ప్రసంగాల్లో పెద్ద ఎత్తునే చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆహామీల అమలు కోసం ఓటర్లు రాత్రి వరకు క్యూలైన్‌లో నిల్చొని ఓట్లు వేశారా..? లేక ప్రభుత్వంపై వ్యతిరేకతా..? లేక అనుకూలతా..? అన్న విషయంపై నాయకులు అంచనాలు వేస్తున్నారు. టిడిపి, వైసిపి రెండు పార్టీలు గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు నియజకవర్గాల్లో రెండు పార్టీల అభ్యర్థులు విలేకరుల సమావేశం నిర్వహించి మరీ తాము భారీ మెజార్టీతో గెలువబోతున్నాం అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇప్పటికే ఫలితాలపై బెట్టింగ్‌లు సైతం వేశారు. ఇలాంటి వారు పోలింగ్ సరళిపై మరింత ఎక్కువగా దృష్టి సారించి లెక్కలు వేస్తున్నారు.

20 రోజులు వేచి ఉండాలా..?

కౌంటింగ్‌కు ఇంకా 20 రోజుల సమయం ఉండడం చాలా మంది సహనానికి పరీక్షగా ఉంది. అన్ని రోజులు ఎలా వేచి ఉండాలంటూ సతమతం అవుతున్నారు. అభ్యర్థుల్లోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. అయితే గత ఎన్నికల్లో కౌంటింగ్‌కు పోలింగ్‌కు 40 రోజుల సమయం ఉండేదని, అంత సమయాన్నే గడిపామని ఇప్పుడు 20 రోజు ఏమంత పెద్ద లెక్కకాదంటున్నారు. ఎలాగో పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఖాళీ సమయం దొరకడంతో కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ఉండేందుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు.

కుదుటపడుతున్న తాడిపత్రి

◆ ముఖ్య నేతలు అరెస్టు, తరలింపులతో సద్దుమణిగిన వాతావరణం

◆ ఇరు పార్టీలకు చెందిన 91 మందిపై కేసు నమోదు

◆ ఉరవకొండ న్యాయమూర్తి ఎదుట నిందితుల హాజరు

◆ కొనసాగుతున్న 144 సెక్షన్

తాడిపత్రి నుంచి పలువురుని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం తాడిపత్రిలో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య రాజుకున్న వివాదం రెండు రోజుల పాటు కొనసాగింది. ఒకరిపై ఒకరు దాడులు ప్రతిదాడులతో తాడిపత్రి అట్టుడికింది. పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో గురువారం నాటికి పరిస్థితులు కాస్త కుదుటపడ్డాయి. ఘర్షణలను నివారించే క్రమంలో భాగంగా ఇరు పార్టీలకు చెందిన ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పక్క జిల్లాలకు తరలించారు. బుధవారం మొదలుపెట్టిన ఈ ఆపరేషన్‌తో ఇరు పార్టీలకు చెందిన దాదాపు 91 మందిపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నాయకులందరూ పోలీసుల అదుపులో ఉండడంతో గురువారం నాడు తాడిపత్రిలో ఎలాంటి ఘర్షణ చోటు చేసుకోలేదు. అరెస్టు చేసిన 91 మందిని జిల్లాలోని ఉరవకొండ మెజిస్ట్రేట్ వద్ద గురువారం హాజరు పరిచారు. అనంతరం వారందరికీ రిమాండ్ విధించి మరికొన్ని రోజులు ఘర్షణలకు పాల్పడకుండా వారిపైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అరెస్టులు భయంతో దాదాపు తాడిపత్రి పట్టణ, మండల నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు.

పోలీసుల అదుపులో జెసి ఇంటి పనిమనుషులు

ఘర్షణలకు తావు లేకుండా చేయడంలో భాగంగా పోలీసులు తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా బుధవారం మొదలుపెట్టిన ఆపరేషన్‌లో జేసీ.ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో పనిచేస్తున్న పనిమనుషులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లో పనిచేయడానికి ఎవరూ లేకపోవడంతో మందులు, ఆహారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి స్వయానా పోలీస్ స్టేషన్‌కు వచ్చి పనిమనుషులను వదిలిపెట్టాలని పోలీసులను కోరారు.

హైదరాబాద్‌కు జెసి కుటుంబ సభ్యులు

తాడిపత్రిలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల దృష్ట్యా మాజీ ఎంపీ జేసీ.దివాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పోలీసులు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు. జేసీ దివాకర్ రెడ్డి, ఆయన కుమారుడు జేసీ పవన్ కుమార్ రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను పోలీసులు హైదరాబాద్‌కు పంపించారు. పని మనుషులు ఎవరినీ ఇంట్లోకి పంపని విషయం తెలుసుకున్న జెసి.దివాకర్ రెడ్డి తనయుడు జేసీ పవన్ కుమార్ రెడ్డి హైదరాబాద్ నుంచి తాడిపత్రికి వచ్చారు. ఈ సమయంలో పవన్‌ను కూడా ఇంట్లోకి పంపేందుకు పోలీసులు అంగీకరించలేదు. తన తల్లి అనారోగ్యంతో ఉంటే ఇంట్లోకి వెళ్లొద్దంటూ అడ్డుకుంటున్న పోలీసులపై పవన్ మండిపడ్డారు. తాడిపత్రిలో ఉండడానికి వీలు లేదని తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి, జేసీ కుటుంబ సభ్యులు అందరినీ భద్రత మధ్య హైదరాబాద్ తరలించారు.

కఠినంగా 144 సెక్షన్

ఎన్నికల ఘర్షణలు జరిగిన నేపథ్యంలో తాడిపత్రిలో 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేస్తున్నట్లు పోలీసు అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఏ పార్టీకి చెందిన వారైనా ఘర్షణలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేశారు. మంగళవారం నాడు తాడిపత్రిలో జరిగిన ఘర్షణలో పాల్గొన్న వారందరినీ అరెస్టు చేస్తామన్నారు. ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. ప్రస్తుతం అరెస్టు అయిన వారందరినీ ఎన్నికల ఫలితాలు విడుదల అయ్యేంతవరకు వదిలిపెట్టమని పోలీసులు హెచ్చరించారు.

'వయోజన క్షయ టీకా'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఒడిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఒడిసి-1 ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారం భమైన వయోజన క్షయ టీకా కార్యక్రమం పరిశీలన తనిఖీల్లో భాగంగా ఆయన ఒడిసి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. శరీరంలో కేలరీల లోపం వల్ల, క్షయ వ్యాధిగ్రస్తుల నుంచి నోటి తుంపర్లతో గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. 3 రోజుల నుంచి జ్వరం రావడం, దగ్గినప్పుడు రక్తపు చారలతో కూడిన గళ్ల పడడం, పక్కటెముకల నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం ఈ వ్యాధి లక్షణాలు అన్నారు. క్షయ నివారణలో భాగంగా ప్రతి గురువారం నిర్వహించే ఈ నూతన వయోజన క్షయ టీకా కార్యక్రమంలో 60 ఏళ్లు దాటిన వారు, చక్కెర వ్యాధిగ్రస్తులు, పొగ తాగువారు, శరీర ద్రవ్యరాశి 18 కన్నా తక్కువ ఉన్నవారు, టిబి రోగులతో సన్నిహితంగా ఉన్నవారు ఈ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన కేంద్రంలోని రికార్డులు, ప్రగతి సూచికలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీకా కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతం కావడానికి జాగ్రత్తలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప సమాచార శాఖ అధికారి బాబా ఫకృద్దీన్, జిల్లా నర్సింగ్ అధికారిణి వీరమ్మ, వైద్యాధికారులు డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ కమల్ రోహిత్, ఆరోగ్య పర్యవేక్షకులు విజయకుమారి, మురళి, ల్యాబ్ టెక్నీషియన్ నరేంద్ర, ఫార్మాసిస్ట్ వరలక్ష్మి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు నాగవేణి, బషీర, రాధ, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

ఒడిసి-1 ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ నాగేంద్రనాయక్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వైసిపి నాయకుల దౌర్జన్యాలకు బాధితులైన టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని శ్రీసత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షుడు జిఎం.శేఖర్ భరోసా ఇచ్చారు. ఈ నెల 13వ తేదీ పోలింగ్ సందర్భంగా మండలంలోని పెడపల్లి గ్రామంలో వైసిపి నాయకుల దాడిలో బిజెపి మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి గాయపడ్డాడు. విషయం తెలియడంతో జిఎం.శేఖర్ గురువారం ఆ గ్రామం వెళ్లి భాస్కర్‌రెడ్డిని, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడకండి అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వచ్చేది కూటమి ప్రభుత్వమేనని, వైసిపి నాయకుల ఆటలు ఇక సాగవని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట డాక్టర్ రాఘవేంద్ర, మురళి, మహానంద, హరి ఉన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

ప్రజాశక్తి-మడకశిర

సమాజంలోని ప్రతిఒక్కరూ సేవా దృక్పథంతో నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఈరలక్కప్ప, నాయకులు శివప్రసాద్, లోకనాథ్‌రెడ్డి తెలిపారు. రొళ్ల మండలంలోని హనుమంతనపల్లి గ్రామంలో గురువారం సీనియర్ వైసిపి నాయకుడు రంగనాథ్ కుటుంబంలో జరిగిన ఓ శుభ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలు ఉండాలని, మిగతా సమయంలో ప్రతి ఒక్కరూ ఒక్కలిగ కుటుంబ సభ్యులు అన్నదమ్ముల్లా మెలగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వెస్టాస్ కంపెనీ మేనేజర్ భవ్య మంజునాథ్, రత్నగిరి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్య జ్యోతి, డిజిటల్ అసిస్టెంట్ సిద్ధు, శ్రీరామ్‌రెడ్డి, దేవరాజ్, లక్ష్మీపతి, తిమ్మరాజు, నవీన్‌కుమార్, సీనియర్ ఉపాధ్యాయుడు హెచ్.తిమ్మప్ప, మల్లేష్, తిప్పేస్వామి, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి

కొత్తచెరువులో వెలసిన సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మనోహర్, నటరాజు తెలిపారు .9 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామి వారిని ఒక్కో రోజు ఒక్కో వాహనంపై కొలువుదీర్చి ఆలయం వద్ద నుంచి గ్రామంలోని వీధుల గుండా ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17వ తేదీ ధ్వజారోహణం, 18న హంస వాహనం, 19న భృంగి వాహనం, 20న శేష వాహనం, 21న నంది వాహనం, 22న కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 24న పార్వేట ఉత్సవం, 25న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

స్వార్థపరుల కల్పవృక్షం... మున్సిపల్ మార్కెట్

- అనుమతులు లేకుండా
అండర్ గ్రౌండ్ స్థలం అప్పగింత
- పురపాలిక ఆదాయానికి గండి

అనుమతులు లేకుండా జరుగుతున్న పూల వ్యాపారాలు

హిందూపురం పురపాలక సంఘ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ అటు పాలకులకు....ఇటు అధికారులకు కల్పవృక్షంగా మారింది. ఇక్కడ ఒక్కొక్కరికి ఒక్కో విధంగా గదులు, స్థలాలను కేటాయించారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి గండి పడింది. స్థలాల కేటాయింపులో మున్సిపల్ రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుని చేతులు దులపుకుంటున్నారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయం కాస్తా పాలకులు, అధికారులు జేబుల్లోకి వెళుతోంది.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే సెకెండ్ గ్రేడ్ కింద హిందూపురం పురపాలక సంఘం ఉంది. ఇక్కడ పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న కూరగాయాల మార్కెట్ శిథిలం అయిందని, గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే పడగొట్టారు. అదే స్థలంలో కూరగాయాల మార్కెట్ తో పాటు వాణిజ్య సముదాయ భవనం నిర్మాణం చేశారు. వాణిజ్య సముదాయ భవనాలను బహిరంగ వేలం వేశారు. అయితే వేలంలో దక్కించుకున్న వారు ఇంత వరకు పూర్తి స్థాయిలో వ్యాపారాలను ప్రారంభించ లేదు. ఇక పోతే కూరగాయాల మార్కెట్ బహిరంగ వేలంలో పాలకులు, అధికారులు కలిసి ఆ సమయంలో భారీ అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. ఏకంగా ఒక కౌన్సిలర్‌కు రూ. 1.35 వేలు, ఇక వైస్ చైర్మన్‌లకు రూ. 3 లక్షలు, చైర్ పర్సన్ కు రూ. 5లక్షలు, మున్సిపల్ అధికారులకు ఏకంగా రూ. 10 లక్షలు కూరగాయాల వ్యాపారులు ఇచ్చినట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. దీంతో తూతూ మంత్రంగా బహిరంగ వేలం నిర్వహించి గదులను అప్పగించారని సమాచారం. వ్యాపారులు గదుల్లో వ్యాపారం చేయకుండా గదుల బయట వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ మొత్తం ఇరుకుగా మారింది. అదే సమయంలో మార్కెట్ ఆవరణంలో ఉన్నా ఖాళీ స్థలాన్ని ఆకుకూరల వ్యాపారులకు 16 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. దీని కోసం ఆ సమయంలో పురపాలక సంఘానికి డిపాజిట్ చెల్లించాలన్న పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ. 30 వేల నుంచి 50వేల రూపాయల వరకు మార్కెట్ అసోసియేషన్ వారు వసూలు చేశారు. ఇందులో పురపాలక సంఘానికి రూ.5వేలు చెల్లించి, మిగిలిన డబ్బులను పాలకులు, అధికారులు వాటాలు వేసుకుని ఆరగించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది చాలదన్నట్లు చివరకు వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలాన్ని పూల వ్యాపారులకు ధారదత్తం చేశారు. దీనికి మున్సిపల్ శాఖకు చెందిన కనీస నిబంధనలు సైతం అధికారులు పాటించ లేదన్న ఆరోపణలు వినపిస్తున్నాయి. ఆకు కూరల వ్యాపారులు, పూల వ్యాపారుల వరకు కేటాయించిన స్థలాలపై ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే పెద్ద అవినీతి బయటపడడమే కాకుండా మున్సిపాల్టీకి ఆదాయం సైతం పెరుగుతుంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా కేటాయింపులు

వానిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ అండర్ గ్రౌండ్‌లో ఉన్నా ఖాళీ స్థలాన్ని 99 మంది చిరు వ్యాపారులకు కేటాయించేందుకు 2022 వ సంవత్సరం నవంబర్ 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఆ తీర్మానం అనుసరించి చిరు వ్యాపారులకు ఖాళీస్థలాన్ని కేటాయించాలి. దీని కోసం 64 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.5వేలు, నెలకు అద్దె రూ.750, 150 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.7500, నెలకు అద్దె రూ. 1250గా నిర్ణయించారు. అయితే ఈ స్థలాన్ని చిరు వ్యాపారులకు కాకుండా పూల వ్యాపారులకు ఈ సంవత్సరం జనవరి 10న గుట్టు చప్పుడు కాకుండా కేటాయించారు. లాటరీ విధానం ద్వారా 25 మంది హోల్‌సేల్ పూల వ్యాపారులకు కేటాయించడానికి ఎంపిక చేశారు. దీనికి ప్రతిఫలంగా పూల వ్యాపారులు పాలక వర్గానికి లక్షల రూపాయల్లో మామూళ్లుఇచ్చే విధంగా రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే పంపకాల్లో బేరం కుదరక పోవడంతో ఈ అంశం రెండు నెలలు జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు రాలేదు. అనంతరం ఎన్నికల కోడ్ రావటంతో ఈ వ్యవహారం అక్కడికే నిలిచి పోయింది. అయితే ఎటువంటి డిపాజిట్, అద్దెలు చెల్లించకుండానే గత 6 నెలలుగా పూల వ్యాపారులు మున్సిపల్ మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలంలో వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీస చర్యలు సైతం తీసుకోవడం లేదు. నిర్ణయించిన అద్దెలు వసూలు చేస్తున్నారా.?, వసూలు చేస్తుంటే ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయి..? అన్నది అర్థం కావడం లేదు.

ఎంత వరకు న్యాయం

మున్సిపల్ కూరగాయాల మార్కెట్ ఆవరణంలో ఆకు కూరల వ్యాపారులు రోజుకు రూ. 300 నుంచి 500 రూపాయల వరకు వ్యాపారం చేస్తారు. వారితో డిపాజిట్ తోపాటు రూ. 500 వరకు నెలకు అద్దెను మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారు. వీరికి కనీస సౌకర్యాలను సైతం కల్పించ లేదు. ఎండకు ఎండుతు వ్యాపారం చేస్తుంటారు. అయితే అన్ని సౌకర్యాలను కల్పించి, ఎండ అన్నది పడకుండా అండర్ గ్రౌండ్ లో కేటాయింపులు చేసుకున్న పూల వ్యాపారులు రోజుకు వేల రూపాయల్లో వ్యాపారం చేస్తారు. వీరికి నెలకు రూ. 750 అద్దె తీసుకునే విధంగా నిర్ణయించిన పాలకులపై తీవ్ర విమర్శలు వినపిస్తున్నాయి.

మార్కెట్ ఆవరణంలో ఎండలో వ్యాపారం చేస్తున్న ఆకుకూరలు, కూరగాయల వ్యాపారులు

ఓటింగ్‌లో మహారాణులు!

ఓపిగ్గా క్యూలైన్‌లో నిల్చొని ఓటేసిన మహిళలు ఎవరికి వీరి మద్దతు..?

ప్రజాశక్తి-కదిరి అర్బన్

18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శత విధాలా అవగాహన కల్పిస్తోంది. ఐనప్పటికీ కొందరు ఓటర్లు ఓటు వేయడానికి ఏవేవో సాకులతో వెనుకడుగు వేస్తుంటారు. రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన మొదటి హక్కు ఓటు హక్కు. మన భవిష్యత్తును తీర్చిదిద్దే, మన రాష్ట్రం, దేశాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఆయుధమే మన ఓటు అని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ క్రమంలోనే ఈ నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో మహిళలే మహారాణులుగా నిలిచారని చెప్పవచ్చు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి మహిళలు చైతన్యవంతులై మూకుమ్మడిగా ముందు కొచ్చారన్న సంగతి ప్రస్తుత ఎన్నికల్లో పోలైన మహిళల ఓట్లను పరిశీలిస్తే అర్థమవుతుంది. కదిరి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,53,220 ఉన్నారు. అందులో పురుషులు 1,24,650, మహిళలు 1,28,762 ఉన్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లలో పురుషులు 1,02,411, మహిళలు 1,03,796 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో మహిళలే ముందున్నారని తెలుస్తోంది. నియోజకవర్గంలో గత ఎన్నికల్లో ఎప్పుడూ పోలింగ్ శాతం తక్కువగానే ఉండేదని తెలుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో 57,330 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారికంగా తెలుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో మహిళలు 29,673, కదిరి గ్రామీణ ప్రాంతంలో 23,843 ఓటు వేశారు. వీటిలో 11,960 మంది మహిళలు ఉన్నారు. తలుపుల మండలంలో పురుషులు కంటే మహిళలే ఎక్కువ మంది ఓటు వేశారు. ఈ మండలంలో 28,010 మంది ఓటు వేశారు. అందులో మహిళలే 14,015మంది ఉన్నారు. నల్లచెరువు మండలంలో 22,177 ఓట్లు ఉన్నాయి. ఇక్కడా 11,031 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకుని పురుషుల కంటే ముందంజలో నిలిచారు. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలు ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకోవడంతో కూటమి (టిడిపి, బిజెపి, జనసేనపార్టీలు) ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై టిడిపి విజయానికి పెద్దపీట వేశారని రాజకీయ కోణంలో చర్చ జరుగుతోంది.

కదిరి నియోజకవర్గంలో మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు

తలుపుల మండలంలో మొత్తం 33,532 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులు-13,994, మహిళలు-14015, ఇతరులు-1 ఓట్లు వేశారు. మొత్తం పోలైన ఓట్లు 28,010, పోలింగ్ శాతం 83,53. గాండ్లపెంట మండలంలో మొత్తం 21,451 ఓట్లు ఉండగా పురుషులు-9,341, మహిళలు 9,325, ఇతరులు-2 ఓట్లు వేశారు. మొత్తం పోలైన ఓట్లు 18,668. కదిరి రూరల్ మండలంలో మొత్తం 27,261 ఓట్లు ఉండగా పోలైన పురుషుల ఓట్లు 11,881, మహిళలు-11,960, ఇతరులు-2 ఓట్లు. మొత్తం పోలైన ఓట్లు 23,843. పోలింగ్ శాతం 87.46. కదిరి పట్టణంలో మొత్తం ఓట్లు 80,953, పురుషులు వేసిన ఓట్లు 28,056, మహిళలు వేసిన ఓట్లు 29,673, ఇతరులు-1, మొత్తం పోలైన ఓట్లు 57,730. పోలింగ్ శాతం 71.31. నంబులపూలకుంట మండలంలో మొత్తం ఓట్లు 24,552, పురుషులు-10,521, మహిళలు-10,258 ఓటు వేశారు. మొత్తం పోలైన ఓట్లు 20,779, పోలింగ్ శాతం 84.63. నల్లచెరువు మండలంలో మొత్తం ఓట్లు 25,017, పురుషులు-11,046, మహిళలు-11,131 ఓట్లు వేశారు. మొత్తం పోలైన ఓట్లు 22,177, పోలింగ్ శాతం 88.65. తనకల్లు మండలంలో మొత్తం 40,654 ఓట్లు, పురుషులు-17,572, మహిళలు-7,434, ఇతరులు-1 ఓట్లు వేశారు. మొత్తం పోలైన ఓట్లు 35,007, పోలింగ్ శాతం 86.11. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం నమోదైన ఓట్లు 2,06,214 కాగా పోలింగ్ శాతం 81.37 నమోదైనట్లు అధికార యంత్రాంగం తెలిపింది.

ఖరీఫ్ విత్తన పంపిణీకి సిద్ధం

జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం 244763 హెక్టార్లు కాగా ఇందులో ప్రధాన పంట అయిన వేరుశనగ సాగు విస్తీర్ణం 174910 హెక్టార్లు ఉంటుందన్నారు. ఈ మేరకు 1,00443 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనం సరఫరాకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వేరుశనగ తో పాటు కందులు, రాగులు, పెసలు, ఉలవలు 40శాతం సబ్సిడీతో సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో రైతులకు అవసరమయ్యే ఎరువులు యూరియా, డిఎపి,ఎంఒపి, కాంప్లెక్స్ తదితర ఎరువులు రైతులకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఆయా గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ అధికారుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎస్పీకి అభినందనలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని ఎన్నికల నిఘా వేదిక సభ్యులు అభినందించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో నిఘా వేదిక సభ్యులు డాక్టర్ భాస్కర్ నాయుడుతో పాటు పలువురు సభ్యులు ఎస్పీని కలిసి అభినందించారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గూడచారి వ్యవస్థను పటిష్టం చేసి ఎక్కడా అల్లర్లు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి పోలింగ్ ప్రశాంతంగా జరిపించి ఓటర్లకు భరోసా కల్పించి ఎక్కువ శాతం పోలింగ్ నమోదయ్యేలా చేశారని వారు ఎస్పీకి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిఘా వేదిక సభ్యులు హరిలాల్ నాయక్, రంజిత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కోటిపి గ్రామ శివారు ప్రాంతంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 60 సంవత్సరాల వయసు ఉంటుందని, ఇతని వద్ద కర్నాటక ప్రాంతానికి చెందిన ఫోన్ నెంబర్లు ఉన్నాయని రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. యూనియన్ బ్యాంక్ ప్రక్కనున్న వీధిలో జన సందోహం వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో నడవటానికి కూడా వీలు లేకుండా పోతోందని ఆప్రాంత ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది మురుగునీరు తొలగించకపోవడంతోనే రోడ్డుపైకి చేరుకుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామంలోని యూనియన్ బ్యాంక్ పక్కవీధిలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

హ్యాండ్‌బాల్ జట్టుకు కదిరి కుర్రోడు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం నిజాం వలీ కాలనీకి చెందిన నదీమ్ అనే యువకుడు ఇండియన్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికయ్యాడు.ఈ మేరకు ఉజ్బేకిస్తాన్ లో నిర్వహిస్తున్న ఏషియన్ మెన్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో నదీమ్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా నదీమ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి జిల్లా కదిరి తరపున ఇండియన్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి కదిరికి పేరు తెస్తానని చెప్పారు.

నదీమ్

సకాలంలో విత్తనకాయలు పంపిణీ చేయండి

గాండ్లపెంట : ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సకాలంలో విత్తన కాయలు పంపిణీ చేయాలని రైతు సంఘం నాయకులు కేకే రాజారెడ్డి, ఖాదర్‌బాషా, గంగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంట సాగు చేసే రైతులకు విత్తన కాయలు పంపిణీ చేస్తే వర్షాలు వచ్చిన వెంటనే విత్తనం వేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఒక్క పాసుపుస్తానికి ఐదు బస్తాలు ఇవ్వాలని రైతులకు ఉచితంగా ఎరువులు అందచేయాలని డిమాండ్ చేశారు.

మార్కెట్లోకి మారుతీ సుజుకీ న్యూ స్విఫ్ట్

అనంతపురం : నగరంలోని జయలక్ష్మి మారుతీ షోరూంలో నూతన స్విఫ్ట్ కారును గురువారం ఆవిష్కరించారు. సరికొత్త టెక్నాలజీ, నూతన హంగులు, అత్యాధునిక సౌకర్యాలతో తయారు చేసిన సరికొత్త మారుతీ న్యూ స్విఫ్ట్ కారు మార్కెట్లోకి ఆవిష్కరించినట్లు షోరూం జనరల్ మేనేజర్ గిరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ రమేష్‌బాబు, సోషల్ మీడియా ప్రతినిధులు డాక్టర్ హరిప్రసాద్, జిఎన్ఎస్ వైభవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఆవిష్కరించిన స్విఫ్ట్ మోడల్‌లో బేసిక్ స్థాయి నుంచి ఆరు సేఫ్టీ బెలూన్స్, నైన్ ఇంచెస్ టచ్ స్క్రీన్ వైర్లెస్ ఛార్జర్ స్పోర్ట్స్ మోడల్ తదితర నూతన సౌకర్యాలతో కొత్తకారును తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం రిలేషన్ షిప్ మేనేజర్ అనిల్‌కుమార్, టీం లీడర్లు రవితేజ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఆపాలి : వైసిపి లీగల్ సెల్

అనంతపురం : తాడిపత్రి అల్లర్ల ఘటనలో వైసిపి కార్యకర్తల అక్రమ అరెస్టులను ఆపాలని వైసిపి లీగల్ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకే మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి అల్లర్లకు తెరలేపారన్నారు. ఓటింగ్ పెరిగితే వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డి గెలుస్తాడని కుట్ర పన్ని అల్లర్లకు పాల్పడ్డారన్నారు. కేవలం జెసి అస్మిత్‌రెడ్డిని గెలిపించేందుకు ఎస్పీతోపాటు ఎఎస్పీ, పోలీసు సిబ్బంది తాడిపత్రిలో రోజంతా అక్కడే మకాం వేశారని ఆరోపించారు. అల్లర్ల సందర్భంగా పెద్దారెడ్డి ఇంట్లోని పని మనుషులను కూడా చితకబాదడం బాధాకరన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లీగల్‌సెల్ అధికార ప్రతినిధి సుధీంద్రనాథ్, తాడిపత్రి లీగల్ సెల్ ఇన్‌ఛార్జి సత్యనారాయణరెడ్డి, నాయకులు ఉమాపతి, నాగన్న పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

డెంగీ నివారణపై పుట్టపర్తి, బత్తలపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, తదితరులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి) పరిధిలో శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మంజువాణి ఆధ్వర్యంలో అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాక్సిన్ వల్ల క్షయ వ్యాధి రాదని, గత ఐదేళ్లలో టిబి వచ్చి తగ్గిపోయిన వారు, 60 ఏళ్లు నిండిన వారు, పొగ తాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, ఎత్తుకు తగిన బరువు కంటే చాలా తక్కువ వుండేవారు, టిబి రోగులతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారు తప్పని సరిగా ఈ వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. అలాగే ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూనే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఫ్రైడే డ్రై డేగా పాటించి జ్వరాల బారిన పడకుండా ఉండాలని అవగాహన కల్పించారు. దోమ పుట్టకూడదు-కుట్టకూడదు, చిన్నదోమ పెనుప్రమాదం, దోమతెరలు వాడండి-దోమకాటు నివారించండి, నీటి నిల్వలు-దోమలకు ఆవాసాలు, వేపాకు పొగ-దోమలకు సెగ అని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ప్రజలు మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కుళ్లాయప్ప, వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, సిహెచ్ఒ నగేష్, పిహెచ్ఎన్ లలితకుమారి, ఎస్‌యుఒ రమణయ్య, డిపిసి మల్లికార్జున, పిపిఎం నాగేంద్ర, డిపిఎస్ ఆంజనేయులు, హెచ్ఇ చంద్రనాయక్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎస్‌టిఎస్ అబిద్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : డెంగీ వ్యాధి నివారణకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పిహెచ్‌సిలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల, కాలానుగుణంగా వ్యాప్తి చెందే వ్యాధుల్లో డెంగీ వ్యాధి అతి ప్రమాదకరం, ప్రాణాంతక మైందన్నారు. సూచనలు పాటిస్తూ, జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధిని నివారించవచ్చన్నారు. ట్రైగర్ దోమగా పిలువబడే ఒక రకమైన దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ దోమకు పరిసరాల అపరిశుభ్రత ముఖ్య దోహదకారకం అన్నారు. నిల్వ ఉండే నీరు, వాడకంలో లేని రోలు, రబ్బరు టైర్లు, టెంకాయ చిప్పలు, పాత డబ్బాలు, కుండలు, తదితర వాటిలో నిల్వ ఉండే వర్షం నీటిలో ఈ దోమలు గుడ్లు పెట్టి అనంతర పరిణామంలో పెద్దవై వ్యాధిగ్రస్తుడిని కుట్టి ఆ తర్వాత ఆరోగ్యవంతులను కుట్టడం ద్వారా డెంగీ వ్యాప్తి చెందుతుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ మాట్లాడుతూ వ్యాధి లక్షణాల్లో ప్రాథమిక దశలో విపరీతమైన తలనొప్పితో కూడిన జ్వరం, రెండో దశలో శరీరంపై నీలిరంగు దద్దుర్లు, మూడవ దశలో మెదడులోని రక్తనాళాలు చిట్లి రక్తంలోని ప్లేట్ టెట్స్ మోతాదు విపరీతంగా వేగంగా తగ్గి హేమరేజ్ లక్షణంతో మృతి చెందడం జరుగుతుందన్నారు. కావున పరిసరాల పరిశుభ్రత, ప్రతి ఫ్రై డే డ్రై డే నియ మాలు పాటించాలన్నారు. నీటి నిల్వలను తొలగించడంలో సామాజిక చైతన్యం పెంపొందించుకొని అందరూ భాగస్వాములైనప్పుడు డెంగీని నివారించవచ్చన్నారు. అనంతరం డెంగీ నివారణపై నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ చేపట్టి ముఖ్యకూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఆయా కార్యక్రమాల్లో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ధర్మవరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌నాయక్, డాక్టర్ పుష్పలత శ్రావణి, ఎంఎస్ఒ జయరాంనాయక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా సాగింది. వారు మాట్లాడుతూ దోమకాటు వల్ల 5 నుంచి 6 రోజులు పాటు జ్వరం వస్తుందన్నారు. తీవ్రమైన తలనొప్పి, కంటి కదలికలతో కన్నునొప్పి, కండరాల నొప్పి, ఎక్కువ దద్దర్లు, వికారం, వాంతులు డెంగ్యూ జ్వరం లక్షణాలు అని తెలిపారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే స్థానిక విలేజ్ హెల్త్ క్లినిక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గంగిరెడ్డి, రాజశేఖర్, సూపర్వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

రొద్దం : డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సిఎస్.సోమశేఖర్ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రొద్దం పరిధిలోని అన్ని సచివాలయాల్లో చేపట్టిన వయోజనుల బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ నివేదిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె తొలుత తురకలాపట్నం సచివాలయం, పెద్ద కోడిపల్లి, రొద్దం గ్రామాల్లో జరిగే వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని అక్కడి వాక్సినేషన్ గదిలో ఐఎల్ఆర్, డీప్ ఫ్రిజ్‌లను పరిశీలించారు. అనంతరం బిజిజి వ్యాక్సినేషన్ ఎలాంటి వారికి వేయించుకోవాలి, ఎలాంటి వారు వేయించుకోకూడదు అనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ విజయలక్ష్మి, ఎఎన్ఎం శేకమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.